# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 93 | పేజీలు : 08 | శుక్రవారం | 10-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా

కేటీఆర్‌తో భేటీ అనంతరం జీవన్ రెడ్డి

- బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు పాటుపడవచ్చని వ్యాఖ్య
- శేషజీవితంలో కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్న జీవన్ రెడ్డి

2



## జీవన్ రెడ్డిపై అసహనం

- జీవన్ రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం
- ముఖ్యమంత్రిపై జీవన్ రెడ్డి విమర్శలను తప్పుబట్టిన టీపీసీసీ చీఫ్
- ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను సీఎంగా ఎన్నుకున్నారని వెల్లడి
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలిసిపోతాయని జోస్యం

2



## అమెరికా-ఇరాన్ ఒప్పందంపై గందరగోళం

పాక్ మధ్యవర్తిత్వంపై నీలినీడలు!

- అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం
- ఒప్పందంలో లెబనాన్ కూడా ఉందని పాక్ ప్రధాని ప్రకటన
- పాక్ వాదనను ఖండించిన అమెరికా, ఇజ్రాయెల్
- ఒప్పందం ఇరాన్‌కే పరిమితమని స్పష్టీకరణ
- ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావించిన అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ చేసిన మధ్యవర్తిత్వంతో రెండు



## జీవన్ రెడ్డి విషయంలో అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సింది: జగ్గారెడ్డి

2



## ముఖ్యమంత్రే చెప్పారు

2

- తమ మంత్రి కంపెనీలో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రే చెప్పారు: హరీశ్ రావు
- రాఘవ కన్ స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారన్న హరీశ్ రావు
- ముఖ్యమంత్రి చెప్పింది తప్పని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు చెప్పలేదని ప్రశ్న
- ఆయన పొంగులేటి కాదని, పొంగు'లూటీ' అని ఎద్దేవా

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తమ మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని తమ అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనుమతులు లేకుండానే నడుపుతున్నారని రాఘవ కన్ స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు....

## 2021 సీన్ మళ్లీ రిపీట్

మమత ఓటమి ఖాయం:నరేంద్ర మోదీ



2

- 2021 సీన్ మళ్లీ రిపీట్-మమత ఓటమి ఖాయం:మోదీ
- త్వరలో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు
- ఈ క్రమంలో పశ్చిమ మేధినీపుర్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- భవానీపుర్‌లో బంగాల్ సీఎం మమతా బెనర్జీ ఓడిపోతారని జోస్యం

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో వచ్చిన ఫలితమే ఈసారి భవానీపుర్‌లోనూ పునరావృతమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అలాగే త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అదే సీన్ రిపీట్ అవుతుందన్నారు. 2021లో నందిగ్రామ్‌లో బంగాల్ సీఎం మమతా బెనర్జీపై బీజేపీ నేత సువేందు అధికారి సాధించిన విజయాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. బంగాల్ యువతకు టీఎంసీ ప్రభుత్వం చేసిన ద్రోహం వందేళ్లయినా సరే ఆ పార్టీ కడిగేసుకోలేదన్నారు. బంగాల్‌లోని పశ్చిమ మేధినీపుర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు."బంగాల్‌లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణమైనవి కావు. ఈ ఎన్నికలు బంగాల్ వైభవాన్ని పునరుద్ధరించేవి. వికసిత్ బంగాల్‌కు పునాదులను బలోపేతం చేసేవి. ఆ దిశగా సాగేందుకు రాష్ట్ర ప్రజలు వేయాల్సిన మొట్టమొదటి అడుగు ఈ నిర్దాక్షిణ్య టీఎంసీ ప్రభుత్వానికి గద్దె దించడమే. దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనిస్తుండగా, టీఎంసీ ప్రభుత్వం మాత్రం బంగాల్‌ను వెనక్కి

## జీవన్ రెడ్డిది తప్పుడు నిర్ణయం



2

- జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళుతుండటంపై ధర్మపురి అర్వింద్ స్పందన
- జీవన్ రెడ్డిది తప్పుడు నిర్ణయమన్న ధర్మపురి అర్వింద్
- అస్తిత్వం కోల్పోతున్న బీఆర్ఎస్‌లో చేరడం వల్ల ప్రయోజనం ఉండదని వ్యాఖ్య
- జీవన్ రెడ్డి అంటే తనకు ఎంతో గౌరవం ఉందన్న అర్వింద్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కాంగ్రెస్ కు రాజీనామా చేసిన సీనియర్ రాజకీయవేత్త జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతుండటంపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల

## భూ రికార్డులు ఇక తారుమారు చేయలేరు...

కరెన్సీకి వాడే టెక్నాలజీ వాడుతున్నాం: సీఎం చంద్రబాబు



## జగన్ 'మావిగన్ జోకర్'గా మిగిలారు

2

- వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రకు 23 ఏళ్లు పూర్తి
- సోషల్ మీడియా వేదికగా షర్మిల ప్రకటన
- సోదరుడు జగన్ పై విమర్శల వర్షం
- వైఎస్ పేరును వాడుకున్నారే తప్ప ఆయనకు వారసుడు కాలేకపోయారని వ్యాఖ్యలు


హైదరాబాద్ పల్స్,డెస్క్

వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి, సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్.. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు....

## ఇల్లు, భూమి, కారు ఏదీ లేదు

- నామినేషన్ దాఖలు చేసిన మమతా బెనర్జీ
- రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు వెల్లడి
- రాయల్టీలు, బ్యాంకు వడ్డీలు ప్రాథమిక ఆదాయంగా వెల్లడి

2



## శత్రువులు మాపై విజయం సాధించలేరు

ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి

- కాల్పుల విరమణ ప్రతిపాదనలో యురేనియం శుద్ధి అంశాన్ని వ్యతిరేకిస్తోన్న అమెరికా
- అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అన్న మొహమ్మద్ ఎస్లామీ
- ఇరాన్ హక్కుల పరిరక్షణ అత్యవసరమని వ్యాఖ్య

2



## బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా

మొదటి పేజీ రువాయి

తాను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి ప్రకటించారు. శేషజీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తు కోసం కూడా పాటుపడవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు, జగిత్యాలలో జీవన్ రెడ్డిని బీర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. హైదరాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్న కేటీఆర్... జీవన్ రెడ్డితో ఆయన నివాసంలో గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ వెంట ఎల్. రమణ, పాడి కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు

**జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట.. జర్నలిస్టులకు గాయాలు**

జగిత్యాలలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీశాయి. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన తోపులాటలో మీడియా ప్రతినిధులు గాయపడటం, వారి పరికరాలు ధ్వంసం కావడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో అక్కడ తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అదుపుతప్పిన కార్యకర్తలు అక్కడ విధుల్లో ఉన్న మీడియా ప్రతినిధులపై పడిపోవడంతో పలువురు జర్నలిస్టులకు గాయాలయ్యాయి. తోపులాటలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన వీడియో కెమెరాలు కిందపడి ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మీడియా ప్రతినిధులు, ఆ కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేసి నిరసన తెలిపారు.

## జగన్ ‘మావిగన్ జోకర్’గా మిగిలారు

మొదటి పేజీ రువాయి

*జగన్ కేవలం వైఎస్సార్ పేరును ఉపయోగించుకున్నారో తప్ప, ఆయన ఆశయాలకు వారసుడు కాలేకపోయారని విమర్శించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన ‘ప్రజా ప్రస్థానం’ పాదయాత్రకు 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా షర్మిల ఈ వ్యాఖ్యలు చేశారు. 2003 ఏప్రిల్ 9న చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్సార్ సాగించిన 1457 కిలోమీటర్ల పాదయాత్ర, కాంగ్రెస్‌ను రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి తెచ్చిన ఒక శాశ్వత జ్ఞాపకమని ఆమె గుర్తుచేశారు. ఆనాటి పాదయాత్ర నేటి అభివృద్ధికి నిర్వచనంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జగన్ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. “వైఎస్సార్ ఐడియాలజీ నిజంగా వైసీపీలో ఉంటే, జగన్ గారు సీఎం అయ్యి కూడా జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదు? ‘మాట తప్పం మడమ తిప్పం’ అనే వైఎస్సార్ నినాదాన్ని వాడుకుంటూ, సంపూర్ణ మద్యపాన నిషేధం అని హామీ ఇచ్చి, కల్తీ మద్యం అమ్ముతూ ‘ఓన్లీ క్యాష్’ మాఫియా ఎందుకు నడిపారు?” అని నిలదీశారు.*

*వైఎస్సార్ జీవితకాలం వ్యతిరేకించిన బీజేపీకి జగన్ దత్తపుత్రుడిగా ఎలా మారారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా క్రైస్తవ మైనారిటీలపై దాడులు జరుగుతున్నా వైఎస్సార్ వారసుడిగా జగన్ ఎందుకు ఖండించలేదని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ హయాంలోనే సంక్షేమానికి అసలైన అర్థం లభించిందని షర్మిల అన్నారు. ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీ రుణాలు, 108/104 సేవలు వంటి ప్రతి పథకం ప్రజల కన్నీళ్ల నుంచి పుట్టిందేనని కొనియాడారు. వైఎస్సార్ ఐడియాలజీ బతికి ఉంది కేవలం కాంగ్రెస్ పార్టీలోనేనని, ఆయన ఆశయాలు మళ్లీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. వైఎస్సార్ అభిమానులందరూ హస్తంతో జతకట్టాలని, ఆనాటి సంక్షేమ పాలనను మళ్లీ తీసుకొద్దామని పిలుపునిచ్చారు. “వైఎస్సార్ అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వైఎస్సార్” అని ఆమె పునరుద్ఘాటించారు.*

## ముఖ్యమంత్రే చెప్పారు

మొదటి పేజీ రువాయి

.పొంగులేటికి చెందిన ఈ కంపెనీలో అవినీతి జరిగిందని సీఎం చెప్పడం, అధికారులు నోటీసులు ఇవ్వడం తప్పా లేక తన కంపెనీపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు. నాలుగు శాఖలకు చెందిన అధికారులు ఈ కంపెనీకి మూడుసార్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తన కంపెనీ విషయంలో ముఖ్యమంత్రి తప్పు చెప్పారని సభలోనే పొంగులేటి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆయన పొంగులేటి కాదని, పొంగు’లూటీ’ అని ఎద్దేవా చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారం గురించి మాట్లాడుతూ, రెండున్నరేళ్లుగా ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. అది ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తోందని నిలదీశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్ల పైకి మాత్రమే వెళుతుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జీవన్ రెడ్డిపై అసహనం

మొదటి పేజీ రువాయి

కాంగ్రెస్ పార్టీకి కొన్నిరోజుల క్రితం రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిపై ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రిపై విమర్శలు జీవన్ రెడ్డికి సరికాదని అన్నారు. ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఇప్పుడు చేపడుతున్న పద్ధతికి తాము వ్యతిరేకమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే దక్షిణ భారతదేశం నష్టపోతుందని అన్నారు. దక్షిణ భారతదేశానికి అన్యాయం జరగకూడదనే తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఈ రెండు పార్టీలు కలిసిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చేస్తున్న విమర్శలకు ఆధారాలు ఉంటే హరీశ్ రావు చూపించాలని డిమాండ్ చేశారు. తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

## జీవన్ రెడ్డిది తప్పుడు నిర్ణయం

మొదటి పేజీ రువాయి

జిల్లా మెట్‌పల్లిలో బీఎస్పీ నేత నిశాంత్ కార్తికేయను బీజేపీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత బీఆర్ఎస్‌లోకి వెళ్లాలనుకోవడం ఒక తప్పుడు నిర్ణయమని, ఆయన తొందరపడి ఈ నిర్ణయం తీసుకున్నారని అర్వింద్ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగతంగా జీవన్ రెడ్డి అంటే తనకు ఎంతో గౌరవమని పేర్కొంటూనే, అస్తిత్వం కోల్పోతున్న బీఆర్ఎస్‌లో చేరడం వల్ల ప్రయోజనం ఉండదని హితవు పలికారు. స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌పై విమర్శలు చేస్తూ, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి నష్టం కలిగిస్తారని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన పార్టీలు మారుతుంటారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి విధివిధానాలు కరవయ్యాయని, ఆ పార్టీ మనుగడ కష్టమని అరవింద్ స్పష్టం చేశారు. ఒకవైపు జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్ ఉత్సాహంగా ఉన్నా, బీజేపీ మాత్రం ఇది ఒక వ్యర్థ ప్రయత్నమని కొట్టిపారేస్తోంది.

## శత్రువులు మాపై విజయం సాధించలేరు

మొదటి పేజీ రువాయి

తమపై ఆంక్షలు విధించిన శత్రువులు విజయం సాధించలేరని ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో యురేనియం శుద్ధి అంశాన్ని అమెరికా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అని స్పష్టం చేశారు. ఇరాన్ హక్కుల పరిరక్షణ అత్యవసరమని వ్యాఖ్యానించారు. అమెరికాతో జరిపే ఎటువంటి కాల్పుల విరమణ చర్చల్లోనూ తమ హక్కుల పరిరక్షణే అత్యవసర అంశంగా ఉండాలని చెప్పారు. తమపై ఆంక్షలు విధిస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడితో ఉద్రిక్త పరిస్థితులు తిరిగి తలెత్తాయి.

## ఇల్లు, భూమి, కారు ఏదీ లేదు

మొదటి పేజీ రువాయి

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనకు సొంత ఇల్లు, భూమి లేదని తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భవానీపూర్ నుంచి పోటీ చేస్తున్న ఆమె నిన్న నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. తనకు సొంత ఇల్లు, వ్యవసాయ భూమి, ఖాళీ స్థలం, నివాస సంబంధిత ఆస్తులు ఏమీ లేవని పేర్కొన్నారు. తనకు కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని తెలిపారు. కాళీఘాట్?లోని 30బీ హరీశ్ ఛటర్జీ వీధిలోని నివాసాన్ని తన చిరునామాగా పేర్కొన్నారు. ఈ ఇల్లు తన పేరు మీద రిజిస్టర్ కాలేదని తెలిపారు. తన పేరుపై రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, చేతిలో రూ.75,700 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు ఖాతాల్లో ఒకటి వ్యక్తిగత బ్యాంకు ఖాతా కాగా, రెండోది ఎన్నికల ఖర్చు కోసం తీసుకున్న బ్యాంకు ఖాతాగా పేర్కొన్నారు. వ్యక్తిగత ఖాతాలో రూ.12,36,209 ఉండగా, రెండో ఖాతాలో రూ.40 వేలు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. తన చరాస్థుల విలువను ఆమె రూ.15.37 లక్షలుగా వెల్లడించారు. ఇందులో బ్యాంకు డిపాజిట్లు, నగదు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. తన వద్ద 9.75 గ్రాముల బంగారం ఉందని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఇది రూ.1.75 లక్షలుగా పేర్కొన్నారు. 2025-26 సంవత్సరంలో తనకు రూ.40,600 టీడీఎస్ రిఫండ్ వచ్చినట్లు చెప్పారు. రాయల్టీలు, బ్యాంకు వడ్డీలు తన ప్రాథమిక ఆదాయంగా వెల్లడించారు.

## అమెరికా-ఇరాన్ ఒప్పందంపై గందరగోళం

మొదటి పేజీ రువాయి

వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చడంపై పాకిస్థాన్, అమెరికా పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడంతో చర్చలకు ముందే దౌత్యపరమైన వివాదం రాజుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, “ఇరాన్, అమెరికా సహా వాటి మిత్రదేశాల మధ్య లెబనాన్‌తో సహా అన్నిచోట్లా తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది” అని ప్రకటించారు. శనివారం నుంచి ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల ప్రతినిధులు చర్చలు జరుపుతారని ఆయన తెలిపారు. అయితే, షెహబాజ్ షరీఫ్ ప్రకటన చేసిన కొద్దిసేపటికే అమెరికా, ఇజ్రాయెల్ వర్గాలు దీనిని ఖండించాయి. ఈ ఒప్పందం కేవలం ఇరాన్‌కు మాత్రమే పరిమితమని, ఇందులో లెబనాన్ ప్రస్తావనే లేదని స్పష్టం చేశాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, “కాల్పుల విరమణలో లెబనాన్ కూడా ఉందని ఇరాన్ భావించి ఉండవచ్చు, కానీ అది వాస్తవం కాదు. మేం అలాంటి హామీ ఎప్పుడూ ఇవ్వలేదు” అని తేల్చిచెప్పారు. ఈ విరుద్ధ ప్రకటనలతో పాకిస్థాన్ మధ్యవర్తిత్వ పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాకిస్థాన్ ఇరు దేశాలకు వేర్వేరు హామీలు ఇచ్చిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ హత్య తర్వాత ఫిబ్రవరి 28 నుంచి పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కాల్పుల విరమణకు పాక్ చొరవ తీసుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి పాక్ ప్రయత్నాలను అభినందించినప్పటికీ, తమ మిత్రపక్షాలపై దాడులు కొనసాగితే ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ గందరగోళం నడుమ, ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరగనున్నాయి. చర్చలకు ముందే వాతావరణం దెబ్బతినడంతో ఈ సమావేశాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పాకిస్థాన్ ప్రభుత్వం మాత్రం ఇస్లామాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది.

## భూ రికార్డులు ఇక తారుమారు చేయలేరు...

మొదటి పేజీ రువాయి

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, 2027 మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో గురువారం జరిగిన ‘మీ భూమి-మీ హక్కు’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పాస్‌పుస్తకాలను అందజేసి, వారి సమక్షంలోనే భూ వివరాలను అధికారులతో చదివి వినిపించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా యజమాని ఇంటికే పంపాలని అధికారులను ఆదేశించారు.

**భూ రికార్డులకు పటిష్ఠ భద్రత**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది ప్రజల భద్రత, జీవనాధారమని అన్నారు. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ‘రీ సర్వే 2.0’ చేపట్టామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 16,816 గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలకు కరెన్సీకి వాడే టెక్నాలజీనే వినియోగిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయలేరని భరోసా ఇచ్చారు. “రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. భూ యజమానులు తమ ఆధార్, ఈ-కేవైసీ ద్వారా భూ రికార్డులను లాక్ చేసుకునేందుకు ‘రికార్డుల లాకర్ సిస్టమ్’ను అందుబాటులోకి తెచ్చాం. ఇది ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా ఉంటుంది. ప్రజల భూములకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే వివాదాస్పద ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం” అని ముఖ్యమంత్రి వివరించారు.

**22ఏ జాబితా ప్రక్షాళన, కీలక నిర్ణయాలు**

భూ యజమానులకు మేలు చేసే పలు కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. 2016కు ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌లో పట్టా పొందిన సుమారు 75 లక్షల పేద కుటుంబాలకు రిజిస్ట్రేషన్ సౌలభ్యం కల్పిస్తున్నామని, దీనివల్ల వారు తమ ఆస్తులను అమ్ముకునేందుకు, గిఫ్ట్‌గా ఇచ్చేందుకు వీలవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం 14 లక్షల ఎకరాల పట్టా భూములను అక్రమంగా 22ఏలో చేర్చిందని, ఆ జాబితాను పూర్తిగా సంస్కరిస్తున్నామని అన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి 22ఏపై కలెక్టర్ అధికారాలను జేసీ, ఆర్డీవోలకు బదలాయిస్తున్నట్లు ప్రకటించారు. వెబ్‌ల్యాండ్ తప్పులను సుమోటోగా సరిదిద్దే అధికారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఇస్తామని చెప్పారు.

## జీవన్ రెడ్డి విషయంలో అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సింది: జగ్గారెడ్డి

మొదటి పేజీ రువాయి

సంగారెడ్డి, ఏప్రిల్ 09: కాంగ్రెస్ పార్టీని టి. జీవన్ రెడ్డి వీడడం బాధాకరమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి తెలిపారు. గురువారం సంగారెడ్డిలో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన ఆయన.. సోనియా, రాహుల్ గాంధీ కుటుంబానికి విధేయుడిగా ఉండేవారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జీవన్ రెడ్డి విషయంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసీ స్థాయిలో పరిశీలన చేసుకుని ఉండాల్సిందని తెలిపారు. ఢిల్లీలోని పార్టీ అధిష్ఠానమే నేరుగా రంగంలోకి దిగి ఈ సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేదని చెప్పారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీలు మారడం ప్రస్తుత రాజకీయాల్లో సహజమై పోయిందన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారడానికి గల కారణాలను మీడియాతో బహిరంగంగా మాట్లాడలేమని పేర్కొన్నారు. కానీ ఈ అంశాన్ని అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామని ఈ సందర్భంగా టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## 2021 సీన్ మళ్లీ రిపీట్

మొదటి పేజీ రువాయి

లాగుతోంది. ఈసారి బంగాల్ ప్రజలు ఎటువంటి ప్రతికూల పరిస్థితులనైనా అధిగమించాలని సంకల్పించారు. ఈ ఉత్సాహంలోనే బీజేపీ విజయం కనిపిస్తోంది. బంగాల్ యువతకు టీఎంసీ ద్రోహం చేసింది. ఇక్కడ ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లేవు. ఒకవేళ ఉన్నా వాటిని చొరబాటుదారులకు కట్టబెట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను టీఎంసీ మంత్రులే దోచుకుంటున్నారు” అని మోదీ తెలిపారు. ఒకప్పుడు దేశం నలుమూలల నుంచి ప్రజలు ఉపాధి కోసం హల్దియాకు వచ్చేవారని, కానీ నేడు ఇదే ప్రాంతానికి చెందిన యువత అండమాన్‌కు, ఒడిశాకు వలస వెళ్తున్నారని ప్రధాని మోదీ తెలిపారు. ఉద్యోగాల వేటలో బంగాల్ వాసులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నారని అన్నారు. టీఎంసీ ప్రభుత్వం హయాంలో నిజంగా వృద్ధి చెందిన ఏకైక విషయం ఏమిటంటే చొరబాట్లేనని ఎద్దేవా చేశారు. నకిలీ పత్రాల తయారీకి, పశువుల అక్రమ రవాణాకు టీఎంసీ ఒక వేదికగా మారిందని ఆరోపించారు. బంగాల్‌లో అధికారంలో ఉన్న మమతా బెనర్జీ ప్రభుత్వం దుష్పరిపాలన చేస్తోందని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీని అధికారం నుంచి గద్దె దించాలని పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ బంగాల్‌ను మత్స్య పరిశ్రమ, సముద్ర ఆహార రంగాలలో స్వయం సమృద్ధిగా మారుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. మత్స్య పరిశ్రమ కోసం బీజేపీ ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం రికార్డు స్థాయిలో బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందన్నారు. అంతేకాకుండా, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎక్కడైతే ఎన్‌డీఏ అధికారంలో ఉంటుందో అక్కడ చేపల ఉత్పత్తిలో వేగవంతమైన వృద్ధి కనిపిస్తోందని తెలిపారు.

# గర్భిణీకి ఆర్థిక సాయం చేసిన సర్పంచ్ కోయ మధు

## డెలివరీ వరకు ఖర్చులు భరిస్తానన్న సర్పంచ్ కోయ మధు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట సర్పంచ్ కోయ మధు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గురువారం హైరిస్క్ గర్భిణి కి ఆర్థిక సాయం అందించడంతోపాటు డెలివరీ వరకు ఖర్చుల బాధ్యత భరించనున్నట్లు హామీ ఇచ్చారు. రాజపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వి.హెచ్.ఎస్.ఎన్.సి కమిటీ సమావేశం గ్రామ సర్పంచ్ కోయ మధు అధ్యక్షతన జరిగింది. ముఖ్యంగా 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా శానిటేషన్ వడదెబ్బ అనీమియా ముక్తి భారత్ హెచ్ఐవి, హెచ్.పి.వి వ్యాక్సిన్ ల పైన కమిటీలో చర్చ జరిగింది. ఇందులో భాగంగా నిరుపేద గర్భిణీ అయిన రామోజు స్వప్న హై రిస్క్ గర్భిణీగా గుర్తించి వైద్య ఖర్చుల నిమిత్తం 2500 రూపాయలను గ్రామ సర్పంచ్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఒక్క సహాయంతోనే కాకుండా గర్భిణీ స్త్రీ డెలివరీ అయ్యేంతవరకు పూర్తి బాధ్యత తీసుకుంటూ ఏ విధమైన సహాయం కానీ తప్పకుండా అందజేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సహాయానికి ముందుకు వచ్చి సహకరించిన గ్రామ సర్పంచి కి కమిటీ సభ్యులందరూ ధన్యవాదాలు తెలియజేస్తూ అభినందించారు సమావేశంలో ఆరోగ్య కార్యకర్త పప్పుల అనిత రిటైర్ హెడ్మాస్టర్ నిమిల బాలకిషన్, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్ పార్వతి, ఆశా కార్యకర్తలు కృష్ణ లీల, లక్ష్మీ ప్రసన్న, సంఘ బంధం అధ్యక్షురాలు గొల్లపల్లి లావణ్య, కారోబార్ హేమలత, వాటర్ మాన్, కమిటీ సభ్యులు గర్భిణీలు తల్లులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ మరియు ఆర్ డబ్ల్యూ యస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం

## నిర్వహించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పి. సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ మండల పరిధిలోని విద్యుత్ మరియు గ్రామీణ నీటి సరఫరా (ఆర్ డబ్ల్యూ యస్ ) శాఖల అధికారులతో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు మరియు తాగునీటి ఎద్దడిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

**సమీక్షా సమావేశంలోని ముఖ్య అంశాలు:**

ఎండకాలం దృష్ట్యా మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్ డబ్ల్యూ యస్ అధికారులను ఆదేశించారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, అవసరమైన చోట కొత్త బోర్లు లేదా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, వ్యవసాయానికి మరియు గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తును అందించాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా లూజ్ వైర్లు లేదా ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడమేనని, ఇందులో నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల విద్యుత్ శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యూ యస్ శాఖ అధికారులు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయండి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, షాద్నగర్ :** కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల తండా గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్ ఆధ్వర్యంలోఎంపీఓ విజయ లక్ష్మికి ఫిర్యాదు చేయడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి గుడాల మౌనిక కోడిచర్ల తండా గ్రామ పంచాయతీ ఏర్పాటు అయినప్పటి నుండి దాదాపు 7 సంవత్సరాలనుండి కొడిచెర్ల తండాకు పంచాయతీ కార్యదర్శి గా కొనసాగుతున్నారు. పలు సార్లు కార్యదర్శి పై అధికారులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయడం లేదు. పాలకవర్గంలో సర్పంచ్ మరియు డిప్యూటీ సర్పంచ్ మధ్యల విభేదాలకు అన్ని రకాలుగా పంచాయతీ కార్యదర్శి కారణమవుతున్నారని అందుకే తమ కార్యదర్శి బదిలీ చేసి నూతన కార్యదర్శిని నియమించాలని కోరారు. ఒక ప్రభుత్వ అధికారి అయి ఉండి ఒక వర్గానికి అనుకూలంగా ఉంటున్నారని డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్ ఎంపీఓకి విన్నవించారు. పంచాయతీ కార్యదర్శి బదిలీ అయితే మా గ్రామ పంచాయతీలో ఎటువంటి ఘర్షణ వాతావరణానికి తావు ఉండదని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఒకవేళ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయకుంటే ఇకపై జరిగే గ్రామ పంచాయతీ సమావేశాలకు మరియు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోబోమని డిప్యూటీ సర్పంచ్ మరియు ఐదుగురు వార్డు సభ్యులు ఎంపీఓకి తెల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఎంపిఓ విజయ లక్ష్మి మాట్లాడుతూ ఈ నెలలో బదిలీ అయ్యేటట్టు చూస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంతోష్ నాయక్ వినోద్ నాయక్ లలిత భాస్కర్ నాయక్ బిచ్య నాయక్ పాల్గొన్నారు.



# ఆర్థికంగా బలపడేలా మహిళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, సంగారెడ్డి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లాలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో - బేటి పడావో పథకం కింద ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మహిళల సాధికారత మరియు ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది మహిళలకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు.మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవనోపాధిని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా కొనసాగింది.ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా బాలసదనంలో నిర్వహించగా టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కుట్టు యంత్రాల పంపిణీ మరియు శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించి తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాల ప్రాముఖ్యతను వివరించి మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ కూడా మహిళల సాధికారతకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం, బాలసదనం సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించడమే కాకుండా, సమాజంలో వారికి ఆత్మవిశ్వాసం మరియు గౌరవం పెంపొందించేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.




# రత్నపురం అంజయ్య దశ దినకర్మలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరే కార్ శ్రీను



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం తండ్రి రత్నపురం అంజయ్య దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరే కార్ శ్రీను రత్నపురం అంజయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని బాలయ్య మైనార్టీ నాయకులు జమీల్ మహేందర్ పాల్గొన్నారు.

# శిక్షణకు హాజరుకాని వార్డు సభ్యులు ఖాళీగా ఉన్న కుర్చీలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల పరిషత్ కార్యాలయంలో రెండవ బ్యాచ్ వార్డు సభ్యుల శిక్షణకు గురువారం ఎవరు కూడా హాజరు కాకపోవడం విశేషం. మొత్తం 17 మంది వివిధ గ్రామాల వార్డు సభ్యులు రెండవ బ్యాచ్ లో నాలుగవ రోజు హాజరు కావాల్సి ఉండగా 11:30 గంటల వరకు కూడా ఎవరు శిక్షణ మందిరం కు చేరుకోలేదు. ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కావలసిన వార్డు సభ్యుల శిక్షణ మందిరం కు నలుగురు పిఓటిలు జమ్లా నాయక్, మెందు సంతోష్ రెడ్డి, చక్రధర్, రేకులపల్లి భాస్కర్ రెడ్డి, లు ఎదురుచూస్తూ వార్డు సభ్యులకు, సర్పంచులకు ఫోన్ చేసి శిక్షణ తరగతులకు హాజరు కావాలని వేడుకున్నారు. దీంతో రెండు గంటల తర్వాత 11:30 నిమిషాలకు 20 మంది వార్డు సభ్యులు తప్పని పరిస్థితుల్లో హాజరయ్యారు. వారికి టీఓటిలు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం 5వ రోజు ముగింపు రోజు కావడంతో తప్పకుండా అందరూ వార్డు సభ్యులు రావాలని కోరారు.

# ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం

## ర్యాలీ ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో హెల్త్ అవేర్నెస్ వీక్ సందర్భంగా ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం భువంగిరి పట్టణంలోని ప్రజా పాలన ప్రగతి ప్రణాలిక 99 రోజులలో భాగంగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో హెల్త్ అవేర్నెస్ వీక్ సందర్భంగా ఎయిడ్స్ పై అవగాహన కల్పించే ర్యాలీ ని మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు ఎయిడ్స్ పై పూర్తి అవగాహనతో ఉండాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని, నివారణ మార్గాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజలకు వైద్యం కొరకు బడ్జెట్లో కేటాయించడం జరిగిందని, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డి.హెచ్.యం.ఒ డాక్టర్ మనోహర్, ప్రోగ్రాం ఇంచార్జ్ డాక్టర్ వంశీకృష్ణ, ప్రభుత్వ వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ రూప బాల నరసయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : రాజపేట మండలం చల్లూరు గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో మంజూరి అయిన సిసి రోడ్ల నిర్మాణం పనులను సర్పంచి రూప బాల నరసయ్య గౌడ్ ప్రారంభించారు. చల్లూరు గ్రామాభివృద్ధికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సీసీ రోడ్లు మంజూరి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొంత సుధాకర్, వార్డ్ మెంబర్లు బైకని కావ్య కనకయ్య, సొల్లేటి కవిత స్వామి, మహేశ్వరం మాధురి సుధాకర్, బడే రాజు, గంగు రాజిరెడ్డి, గ్రామ పెద్దలు గ్రామస్తులు బడే ఎల్లయ్య, మునిగడప కనకయ్య, చేట్కూరి గౌరయ్య, అర్కల బుచ్చిరెడ్డి, బడే నరసయ్య, బడే లక్ష్మయ్య, కోట కిష్టయ్య, గ్యార రాములు, శాగ నవీన్, మునిగడప శ్రీకాంత్, గ్యార రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బూరుగు పోశెట్టి తాటిచెట్టి పై నుండి పడి మృతి చెందారు. ఎప్పటిలాగే కళ్ళు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడిన పోశెట్టికి తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన గీత కార్మికుని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షులు పాండవుల లక్ష్మణ్ గౌడ్ కోరారు.

## యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కు బిజెపి నాయకుల వినతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : రాజపేట మండల భారతీయ జనతా పార్టి శాఖ అధ్యక్షులు మేకల రమేష్ ఆధ్వర్యంలో గురువారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. యాదగిరిగుట్ట నుండి రాజపేట రూట్ బస్సులను పూర్తి స్థాయిలో నడుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాచేపల్లి శ్రీనివాస్, రేణికుంట మాజీ ఉప సర్పంచ్ బూర్గు శేఖర్ రెడ్డి, బిజెపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు




# డబుల్ బెడ్ రూం ఇళ్లు కోసం కేటాయించిన భూమిలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

### గడ్డం వెంకటేష్, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో పూడికలు తీసి స్టీలు వేసి లారీ లోడ్ సిమెంట్ దుర్వినియోగం చేశారని అట్టి స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం రాజపేట మండలంలో సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇవ్వడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైన నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అట్టి స్థలంలో గుడిసెలు నిర్మించుకున్నటువంటి పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని దాదాపు 15 నుండి 20 సంవత్సరాల కాలం నుండి పేదలు అట్టి ప్రదేశంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. దాదాపు 100 ఇండ్లకు పట్టా కాగితాలు ఇవ్వవలసి ఉంది కానీ కొంతమందికి మాత్రమే అట్టా కాగితాలు ఇచ్చారని వారు అన్నారు. ఎన్నికల సమయంలో స్థానిక శాసనసభ్యులు అనేక వాగ్దానాలు చేసి గెలిచిన తర్వాత కనీసం కాలనీ వైపు చూసిన దాఖలాలు లేవని వారు అన్నారు. ఇంటి స్థలాల విషయంలో అనేకసార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకున్న పరిస్థితి లేదని వారు అన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్థానిక శాసనసభ్యులు స్పందించి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి పట్టా కాగితాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఇటికాల రామచంద్రం, సీనియర్ నాయకురాలు పబ్బోజు రాధమ్మ, సుజాత, నిర్మల, నరసింహ, బిబి కలమ్మ, అభిరాం తదితరులు పాల్గొన్నారు.

# చారిగాం అక్రమ మైనింగ్ తవ్వాకాల పై ఉక్కు పాదం

### అక్రమ మైనింగ్ పై క్షేత్ర స్థాయిలో సంయుక్త సర్వే నిర్వహించిన మైనింగ్ శాఖ అధికారులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం కాగజ్ నగర్ పట్టణం సమీపంలో గల చారిగాం గ్రామ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్ పై సంబంధిత అధికార యంత్రాంగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.. మైనింగ్ ఏడీ, మైనింగ్ ఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయం నుండి రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్, ఇతర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలనలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పూర్తిగా సర్వే చేసి, స్థలాన్ని పార్ట్‌లుగా గుర్తించారు.అక్రమ మైనింగ్ జరిగిన భూములకు సంబంధించిన నలుగురు పట్టాదారులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఒక్క పట్టాదారు మాత్రమే హాజరయ్యారు. మిగతా ముగ్గురు హాజరుకాలేదు. అధికారులు మాట్లాడుతూ, హాజరుకాని పట్టాదారులకు నోటీసులు జారీ చేసి, మరొకసారి విచారణకు పిలిపిస్తామని తెలిపారు. అనంతరం వారి భూములను గుర్తించి, ఆయా భూముల్లో ఎంత మట్టిని అక్రమంగా తవ్వారో స్పష్టంగా అంచనా వేసి, చట్టపరంగా వారికి ఫైన్లు విధిస్తామని వెల్లడించారు.ప్రభుత్వ భూములు, సహజ వనరులను రక్షించడానికి అక్రమ మైనింగ్ పై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# అభివృది-సంక్షేమంతోపాటు కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయాలి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో నేతల ఉద్ఘాటన


### రాష్ట్ర పీసీసీ ఇచ్చిన 6 అంశాలతో కూడిన అజెండాపై సుదీర్ఘ చర్చ - తీర్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఎప్రిల్ 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి-ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ పార్టీని గ్రామ వార్డు స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సంస్థాగతంగా నిర్మాణంతోపాటు బలమైన శక్తిగా నిర్మాణం చేయాలని కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో పార్టీ నేతలు నిర్ణయించారు. కొత్తగూడెంలోని ఇల్లందు గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోటదేవి ప్రసన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి; పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు; ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు,
జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ కిరణ్ మిత్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, తదితరులు పాల్గొని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఇచ్చిన ఆరు అంశాలతో కూడిన అజెండాపై సుదీర్ఘంగా చర్చించారు పలు అంశాలపై తీర్మానాలు చేశారు

# నేడే కేఎస్ పీపీ నాలుగో స్నాతకోత్సవం

### ముఖ్య అతిథిగా: నీతి ఆయోగ్ పూర్వ సీఈఓ అమితాబ్ కాంత్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09 :**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) 2026 బ్యాచ్ విద్యార్థుల కోసం నాలుగో పట్టభద్రుల దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలువనున్న ఈ కార్యక్రమంలో 35 మంది పట్టభద్రులు ప్రజా విధానం, పరిపాలనా రంగంలోకి అడుగుపెడుతున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ మాజీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, భారతదేశపు జీ-20 షెర్పా అయిన అమితాబ్ కాంత్ విచ్చేస్తున్నారు. విశిష్ట సంస్కర్త, మేధో నాయకుడైన ఆయన, భారతదేశపు జీ-20 అధ్యక్షత సమయంలో కీలక పాత్ర పోషించి, చారిత్రాత్మకమైన న్యూఢిల్లీ నాయకుల ప్రకటనకు తోడ్పడ్డారు.ప్రజా సేవలో విశిష్టమైన వృత్తి జీవితం గడిపిన అమితాబ్ కాంత్, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, వ్యాపార సౌలభ్య సంస్కరణల వంటి పరివర్తనాత్మక కార్యక్రమాలకు నాయకత్వం వహించి, భారతదేశ ఆర్థిక, పాలనా స్వరూపాన్ని గణనీయంగా తీర్చిదిద్దారు.
ఈ కార్యక్రమంలో పట్టభద్రులైన విద్యార్థుల బృందం యొక్క విజయాలను వేడుకగా జరుపుకోవడంతో పాటు, సమ్మిళిత వృద్ధికి, దేశ నిర్మాణానికి అంకితమైన భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో కేఎస్ పీపీ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించనున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఆత్రం సుగుణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, ఇళ్ల నిర్మాణం నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల కలలను నిజం చేసే ముఖ్యమైన కార్యక్రమం. ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది. నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తాను. గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ మోత్కూపల్లి జ్యోతి ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం రాజపేట మండలం పారుపల్లి గ్రామంలో వైద్య శిబిరం ఎర్పాటు చేశారు. ఈ శిబిరం ను గ్రామ సర్పంచ్ మోత్కూపల్లి జ్యోతి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు ఈ సందర్బంగా మాట్లాడుతూ హెల్త్ క్యాంప్ లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఇటువంటి కార్యక్రమం వలన అందరికీ వైద్యం అందుతుందని పేర్కొన్నారు ఇందులో బిపి, షుగర్, క్యాన్సర్, టీబీ వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ మోసెస్ రాజ్, హెల్త్ ఆఫీసర్ భీకు నాయక్, సూపెరవైసర్ విజయలక్ష్మి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పల్లె దావఖన డాక్టర్ చైతన్య, హెల్త్ అసిస్టెంట్లు ఉపేందర్, మాధవి మాజీ సర్పంచ్ జుకంటి బక్కులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరాటే మాస్టర్ ఓరుగంటి సంతోష్ కు కృతజ్ఞతా సత్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన తొలి మలి ఉద్యమకారుడు పుల్లంగారి సిద్దయ్య మనవడు విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ ను జనగామ మండలం చౌడారం ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కారం జరిగింది. సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ముగింపు కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిట్టపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో జరగగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడు నెలల పాటు సంతోష్ కుమార్ విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో విద్యార్థులకు ఆపద నుండి తమకు తాము రక్షించుకునే మెలకువలను నేర్పించడంతోపాటు, పంచులు కిక్కులు, కటాస్ బ్లాక్ ఇతర అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ సంతోష్ కుమార్ ను విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా సత్కరించారు. కృతజ్ఞతలు చెప్పారు.

# అంగన్వాడీ టీచర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్
- రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, నారాయణఖేడ్ :**
కంగ్టి మండలం రాసోల్ గ్రామంలో అంగన్వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టి అవమానపరిచిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖైసర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న కంగ్టి మండలం రాసోల్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, టీచర్ భర్త హెచ్‌బిఎస్ ఫైనాన్స్ పేరిట డబ్బులు తీసుకొని మోసం చేశాడని ఆరోపిస్తూ, అంగన్వాడీ టీచర్‌ను చెట్టుకు తాడుతో కట్టి నిర్బంధించడం అత్యంత అమానుష చర్య అని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఇప్పటికే కోర్టులో విచారణలో ఉన్నప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఒక మహిళను ప్రజల మధ్య అవమానపరచడం తీవ్రంగా ఖండించదగ్గదని అన్నారు. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిపై వెంటనే చట్టరీత్య చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ పూర్తిగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆత్మకూర్ లో ప్రొ.జయశంకర్ బడి బాట కార్యక్రమం ప్రారంభం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొ.జయశంకర్ బడి బాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం మరియు ఇతర సదుపాయాలు విద్యార్థులకు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కే. మహాదేవ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, గ్రామ కార్యదర్శి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కోరే బిక్షపతి, బిల్ కలెక్టర్ సుదర్శన్, కారోబార్ కిష్టయ్య, మల్గా క్రాంతి, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డీసీసీ కార్యాలయంలో ఘనంగా రాంజీ గోండ్ వర్ధంతి


### నివాళులర్పించిన డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తొలి స్వాతంత్ర సమరయోధుడు మర్సుకొల రాంజీ గోండ్ వర్ధంతి సందర్భంగ జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి రాంజీ గోండ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో రాంజీ గోండ్ చేసిన త్యాగాలు అపారమని పేర్కొన్నారు. దేశ స్వేచ్ఛ కోసం ఆయన ప్రాణత్యాగం చేసిన మహనీయుడని, ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన రాంజీ గోండ్ చరిత్రను యువత తెలుసుకోవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి,మందగూడ సర్పంచ్ గోపాల్,రవ్ అహ్మద్,కనక నాగోరావ్,హరీష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాంజీ గోండ్ సేవలను స్మరించుకున్నారు

# అంగన్వాడీ కేంద్రంలో టీచర్ గైర్హాజరు..చర్యలకు హెచ్చరిక

### గ్రామ సర్పంచ్ బొట్టుపల్లి కృష్ణవేణి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం దరోగపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో టీచర్ గైర్హాజరు వెలుగుచూసింది. ఉదయం 11:10 గంటలకు సర్పంచ్ బొట్టుపెల్లి కృష్ణవేణి పరిశీలనకు వెళ్లగా, కేంద్రంలో టీచర్ లేకుండా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. ఈ ఘటనపై అసంతృప్తి వ్యక్తం చేసిన సర్పంచ్, గతంలో కూడా ఇలాంటి నిర్లక్ష్యం జరిగినట్లు తెలిపారు. మరోసారి విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరించారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, షాద్నగర్,**
మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో కొత్తూరు మండలంలోని కోడిచర్ల తండా గ్రామానికి చెందిన జరుపుల కుమార్ నాయక్ కు మంజూరైన సీఎమ్ఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్ మరియు కొత్తూరు మండల బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బిచ్య నాయక్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఆపదలో అనూహ్యంగా జరిగే ప్రమాదాలకు మధ్యతరగతి కుటుంబాలు ఎంతో సతమతం అవుతాయని... ఇలాంటి పరిణామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తుందని ఈ సందర్భంగా బిచ్య నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్ నాయక్, సూర్య నాయక్, నర్ష నాయక్, గోవింద్ నాయక్, ఇట్య నాయక్, తావు నాయక్, దాస్య నాయక్, లచ్చు నాయక్,మాజీ సర్పంచ్ సోమ్లా నాయక్, మోహన్ నాయక్, కుమార్ నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు

# నాలుగు రోజుల వయోజన విద్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కమ్యునిటి సపోర్టరు సహకారంతో లీవ్ ఫర్ క్రిస్ట్ మినిస్ట్రీస్ స్వచ్చంద సేవా సంస్థ గోదావరిఖని వారి ఆద్వర్యంలో తెలంగాణ రాష్టంలోన 2 ఆసిఫాబాద్ జిల్లా నందు నాలుగు రోజుల వయోజన విద్య. టీచర్స్ ట్రైనింగ్ పొగ్రామ్" ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమమును ముఖ్య అతిధిగా ఆసిఫాబాద్ (ఎం ఈ ఓ ) సుభాష్ హాజరైన విద్యా టిజర్స్ శిక్షణలో వయోజన విద్యా గురించి చెప్పారు. ఈ శిక్షణలో తరగతులలో 4 రోజులు బోధించడానికి హైదరాబాద్ నుండి వచ్చిన రిసోర్సెస్ పర్సన్
జయపాల్ రెడ్డి మరియు తబిత వచ్చారు. ఈ ప్రోగ్రాంను ఆర్గనైజింగ్ చేస్తున్న ఎన్ జీ ఓ డైరెక్టర్ కాశిపేట స్వామిదాస్ (గోదావరిఖని) మరియు ఎన్ జి ఓ సభ్యులు మరియు 20 మంది టీచర్స్ మరియు పొగ్రామ్ సూపర్ వైజర్స్ అయిన జయరాజు,సుధాకర్, రిచర్డ్ హాజరయ్యారు. ఈ వయోజన విద్యా టీచర్స్ శిక్షణ తరగతలో ఆసిఫాబాద్ లోని అగాపే క్యాంపస్ నందు ఏర్పాటు చేయడం జరిగింది.

# అరైవ్-అలైవ్ కార్యక్రమం 13 నుంచి ప్రారంభం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13 నుంచి 18 వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి శివధర్ రెడ్డి సహా ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రహదారి భద్రతపై సమీక్షించారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో రహదారి భద్రతపై గ్రామ సభలు నిర్వహించి కమిటీల ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రజలతో భద్రత ప్రతిజ్ఞ చేయించాలని, డ్రైవర్లకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రతి నెల సమావేశాలు నిర్వహించి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతంగా అమలు చేస్తామని కలెక్టర్ హరిత తెలిపారు

## పూనగూడలో నీటి సమస్యకు నూతన బావి ఏర్పాటుతో పరిష్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం పూనగూడ గ్రామంలో ఎండాకాలంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉండటంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో గ్రామంలో నూతన బావిని తవ్వించారు. భారీ జెసిబి యంత్రంతో బావి తవ్వకాలు చేపట్టగా, ఈ పనులకు అవసరమైన ఖర్చులను స్వయంగా భరించినట్లు సమాచారం. గ్రామ సర్పంచ్ పెందోర్ దేవుబాయి, వర్డ్ సభ్యులు కుంరం బొజ్జుబాయి, గ్రామ పెద్దలు పటేల్, కవో బరికరావు, కుంరం ఈశ్రు, కతేలే మరు, నైతం జగన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బావి ఏర్పాటు వల్ల పూనగూడ గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

## అత్యాశతో 10 రోజుల్లో.. రూ.12 కోట్లు పోగొట్టుకున్న డాక్టర్ : ఇన్ని కోట్లు ఉన్నా.. ఈ కక్కుర్తి ఎందుకు సామీ..!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, క్రైమ్ డెస్క్:**
కోట్లకు కోట్ల డబ్బు ఉంది. పూణె సిటీలోనే పెద్ద డాక్టర్.. కోట్ల రూపాయలు సంపాదించారు.. అయినా ఆశ చావలేదు.. ఇంకా ఇంకా అని డబ్బు కోసం పరిగెత్తాడు.. ఓ ఇన్వెస్ట్ మెంట్ యాప్ లో పెట్టుబడి పెడితే డబుల్, ట్రిపుల్ అవుతాయని నమ్మాడు.. జస్ట్ 11 అంటే 11రోజుల్లోనే.. ఆ యాప్ లోకి ఏకంగా 12 కోట్ల రూపాయలు బదిలీ చేశాడు.. తీరా చూస్తే ఏమైందీ.. డబుల్, ట్రిపుల్ కాకపోగా.. ఉన్న 12 కోట్ల రూపాయలు పోయాయి.. సైబర్ క్రిమినల్స్ వలలో పడి.. అత్యాశకు పోయి సర్వం పోగొట్టుకున్న ఈ డాక్టర్ పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే.. కేవలం 11 రోజుల్లోనే డబ్బును రెట్టింపు చేస్తామన్న సైబర్ మోసగాళ్లను నమ్మి... ఉన్న రూ. 12 కోట్లు పోగొట్టుకున్నాడు పూణేకి చెందిన డాక్టర్. తమ ద్వారా స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెడితే 11 రోజుల్లో రూ.54 కోట్ల వరకు ఆదాయం వస్తుందని డాక్టర్ ను నమ్మించారు కేటుగాళ్లు. తక్కువ కాలంలో భారీ లాభాలు వస్తాయన్న అత్యాశతో పలు దఫాలుగా కేటుగాళ్లకు డబ్బులు బదిలీ చేశాడు. జనవరి నెలలో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల ద్వారా అధిక లాభాలు ఇస్తామని ఒక గుర్తుతెలియని నంబర్ నుండి మెసేజ్ రావడంతో ఈ స్కాం మొదలైంది. మెసేజ్ చూసి ఆశపడి రిప్లై ఇచ్చిన డాక్టర్ ను సైబర్ మోసగాళ్లు 'విఐపి స్టాక్ 24' అనే వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ చేశారు. ఈ గ్రూప్ ద్వారా, నిందితులు ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ వివరించారు. మోసగాళ్లు చెప్పిన సూచనలను ఖచ్చితంగా పాటిస్తే, కేవలం 11 రోజుల్లోనే అతని డబ్బు ఎన్నో రెట్లు పెరుగుతుందని డాక్టర్ ను తమ ట్రాప్ లో వేసుకున్నారు కేటుగాళ్లు.

ఫేక్ ట్రేడింగ్ యాప్, ఫేక్ ప్రాఫిట్స్:

బాధితుడు వాట్సాప్ గ్రూప్ లో జాయిన్ అయిన తర్వాత ఫేక్ ట్రేడింగ్ యాప్ ఇన్స్టాల్ చేయించారు కేటుగాళ్లు. యాప్ ద్వారా బాధితుడి పర్సనల్ డీటెయిల్స్, ఆర్థిక వివరాలు తీసుకొని.. బ్యాంకు అకౌంట్స్ కి డబ్బులు పంపమని చెప్పారు. బాధితుడి నుంచి వచ్చిన సొమ్మును నకిలీ ట్రేడింగ్ యాప్ లో పెట్టుబడి పెట్టినట్లుగా చూపించి... ఫేక్ లాభాలు చూపించి నమ్మించారు.

8 లావాదేవీలలో రూ. 12.31 కోట్లు బదిలీ:

మార్చి 7 నుంచి మార్చి 18 మధ్య, బాధితుడు మోసగాళ్లకు ఎనిమిది వేర్వేరు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ. 12.31 కోట్లను బదిలీ చేస్తూ, ఎనిమిది ట్రాంజాక్షన్స్ జరిపినట్లు తెలిపారు పోలీసులు. ఆ తర్వాత మరికొంత డబ్బు పంపేందుకు బాధితుడు నిరాకరించడంతో అతని ఆస్తులు జప్తు చేస్తామని బెదిరించి బలవంతంగా డబ్బులు ట్రాన్స్ఫర్ చేయించుకున్నారని పోలీసులతో వాపోయాడు బాధితుడు.మోసగాళ్లు చెప్పినట్లు రెట్టింపు లాభాలు వస్తాయని.. దాదాపు మూడు నెలల పాటు డబ్బులు ట్రాన్స్ఫర్ చేసినట్లు తెలిపాడు బాధితుడు. అయితే... డబ్బులు తిరిగి రాకపోవడం... మోసగాళ్లు ఇంకొంచెం డబ్బులు పంపమని అడగడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు బాధితుడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు. లావాదేవీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి 65వ జన్మదిన వేడుకలు

### పుణ్య దంపతులకు పూల మాలలతో సత్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి జిల్లాలోని పేరుగాంచిన వ్యక్తి లయన్స్ క్లబ్ గవర్నర్ , సంఘసంస్కర్త, ప్రముఖ ఐటిసి కాంట్రాక్టర్ అయిన బూసిరెడ్డి శంకర్ రెడ్డి 65 వ జన్మదిన వేడుకలు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో తమ అభిమానులు ఘనంగా నిర్వహించారు. బూసిరెడ్డి శంకర్ రెడ్డి లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, విద్యార్థుల వీరాభిమాని అని, విద్యార్థుల కొరకై ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి వారి హృదయాల్లో నిలిచిపోయిన మానవతావాది అని,నిరుపేద గుండెల్లో ఆపద్రక్షకుడు అని ముద్ర ఉందని వారిని పలువురు కొని ఆడారు. వేల మొక్కల జీవనానికి తన ఒక పునాది అని అన్నారు. ఈ సందర్భంగా వారి అభిమానులు పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపి, శాలువాలతో సత్కరించి, వారి దంపతులు ఇరువురిని పూలదండలు వేసి సత్కరించి కేక్ కటింగ్ చేయించారు. నేడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా పలు సోషల్ మీడియాలలో, చారవాణి ద్వారా ఆయనకు పలువురు అధికారులు, నాయకులు, స్నేహితులు, అభిమానులు జన్మదిన శు భాకాంక్షలను తెలిపారు. తన జన్మదినం సందర్భంగా శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపి, ఇలానే జీవితం అంతా ప్రజల కోసం ముందుకు కొనసాగుతానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంజి సంపత్ దేపంగి రామచందర్, వైన్ రెడ్డి గోనెల సతీష్ కుమార్, పాటి సోమిరెడ్డి, రామకృష్ణ కంది, మోహన్ రెడ్డి రమణయ్య, వై, కుమార్ వై సి హెచ్ వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రేగా కాంతారావు పుట్టినరోజు సంబరాలు

### దాసరి వెంకటరమణ సేవా సమితి విద్యార్థులకు పెన్నులు బహుకరణ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పుట్టినరోజు సందర్భంగా దాసరి వెంకటరమణ సేవా సమితి ఆధ్వర్యంలో బూర్గంపహాడు మండలం సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో వినూత్న సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న స్థానిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిల్‌లు, పెన్నులు పంపిణీ చేసి వేడుకలను అర్థవంతంగా జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న దాసరి వెంకటరమణ మాట్లాడుతూ, కరోనా మహమ్మారి, వరదల సమయంలో రేగా కాంతారావు పినపాక నియోజకవర్గం, బూర్గంపహాడు మండల ప్రజలకు అందించిన అమూల్య సేవలను గుర్తుచేశారు. కష్టకాలంలో ప్రజల అండగా నిలిచిన ఆదివాసి ముద్దుబిడ్డ, మన్యం దొర, మాజీ ప్రభుత్వ విప్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులైన ఆయన పేరు ఎప్పటికీ నిలిచిపోతుందని తెలిపారు.
పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమం అతి అవసరమని, ఇలాంటి సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. సేవా సమితి ద్వారా గతంలో నందిగామలో హార్ట్ ప్రాబ్లమ్‌తో బాధపడిన కుటుంబానికి బియ్యం, నగదు, ఎటపాకలో క్యాన్సర్ బాధిత కుటుంబానికి సహాయం, సారపాక సుందరయ్య నగర్‌లో వేడి నీళ్లతో కాలిపోయిన పాపకు రెండుసార్లు ఆర్థిక సహాయం, వృద్ధులకు చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు చేశామని తెలిపారు. ముందు కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దాసరి వెంకటరమణ, సేవా సమితి సభ్యులు కలిసి రేగా కాంతారావు కి హృదయపూర్వక పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఆయన ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీటీసీ మండల మహిళా నాయకురాలు దాసరి వెంకటరమణ, యువజన మహిళా నాయకురాలు దార్ల బేబీ రాణి, సేవా సమితి సభ్యులు సాంబశివరావు, లేడా శీను, దాసరి మోహన్ రావు, పవన్ కళ్యాణ్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, చైతన్య రెడ్డి, సురేష్, ఎనిమిదో వార్డు సభ్యులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు



# పాఠశాల స్థలం కబ్జాకు యత్నం..బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి!

**మెదక్ ఎంపీ రఘునందన్ డిమాండ్**
**కలెక్టర్ తీరుపై తీవ్ర అసంతృప్తి**



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09 :**
పాటన్ చెరు పట్టణం నడిబొడ్డున వున్న జిల్లా పరిషత్ హై స్కూల్ స్థలం కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే పాఠశాల భవనాన్ని రాత్రికి రాత్రి కూల్చి వేశారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్ తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. గురువారం పటాన్చెరు శ్రీనగర్ కాలనీలో మంగళవారం రాత్రి కూల్చి వేసిన పాఠశాల భవనాన్ని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు.

**రాత్రికి రాత్రి కూల్చివేసిన పాఠశాల భవనం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఫోన్ చేసి కలెక్టర్ కు, డీసీపీ కి ఫిర్యాదు చేసేవరకు కూల్చివేతలు కొనసాగాయని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు పాఠశాల అడ్డుగా లేకున్నా ఎందుకు కూల్చివేశారు, ఎవరు కూల్చారు, ఎవరి ఆదేశాలతో కూల్చారో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రహరికి ముందు ఉన్న దుకాణాలు తొలగించకుండా ప్రహరీ నుంచి పది అడుగుల దూరంలో ఉన్న భవనాన్ని రాత్రికి రాత్రి ఎందుకు కూలచాల్సి వచ్చిందని ప్రశ్నించారు.1962 కు పూర్వం నుంచే అక్కడ పాఠశాల ఉందని, భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్స్ చూపిస్తూ, సర్వే రిపోర్ట్ లను సైతం ఆయన ప్రదర్శించారు. స్థానికంగా ఉన్న కొందరు ఆ భూమి పై వివాదం సృష్టించి కింది కోర్టు నుంచి సుప్రీం కోర్ట్ వరకు అన్నికోర్టుల్లోనూ ఓడిపోయారని గుర్తు చేశారు. పాఠశాల స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లాకలెక్టర్ స్పందన పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే అధికారులను పంపి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉదాసీనంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారి విస్తరణకు, పాఠశాల కూల్చి వేతకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.




# నూతన కాలనీలకు మంచి నీరు అందించండి

### జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09:**
పటాన్ చెరు నియోజకవర్గంలోని జలమండలి పరిధిలోగల నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు.గురువారం హైదరాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామం, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్ 2, సృజన లక్ష్మీ కాలనీ ఫేజ్ 4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీలలో మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రతి రోజు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. పైన పేర్కొన్న కాలనీలలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని.. రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి. అతి త్వరలో నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు.



# కాప్రా నూతన ప్రెస్ క్లబ్ పధాన కార్యదర్శికి ఘనంగా సన్మానం

### ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన తుర్కపల్లి ప్రజాప్రతినిధులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కాప్రా నూతన ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తుర్కపల్లి మండలానికి చెందిన విలేకరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆదిమూలం శ్రీనివాస్ ని తుర్కపల్లి మండలం నుండి ఘనంగా సత్కరించారు. తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఆదిమూలం శ్రీనివాస్ ప్రస్తుతం సాక్షి రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తూ, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుర్కపల్లి మండలం నుండి పెద్ద ఎత్తున మీడియా ప్రతినిధులు, పలువురు నాయకులు, ఆత్మీయులు హాజరై, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఆదిమూలం శ్రీనివాస్ ని ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.





# శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న దేవాదాయ కమిషనర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ దేవాదాయ శాఖ కమిషనర్ ఐఏఎస్ హనుమంతరావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు మాధవాచార్యులు, సిద్ధార్థాచార్యులు, డీఈవో నవీన్ కుమార్, ఏఈఓలు శంకర్ నాయక్, మహేష్ కుమార్, సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి, రాజన్ బాబు, ఎస్పీఎఫ్ శేషగిరిరావు, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది నందు నాయక్, అనిల్, ఆలయ ఇంచార్జ్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించాలి

## : కలెక్టర్ అనురాగ్ జయంతి






**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాల్సిన అవసరం ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం భువనగిరి పట్టణంలోని హనుమాన్‌వాడలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదులు, డార్మిటరీ హాల్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అని తెలుసుకున్నారు. భోజనశాలను తనిఖీ చేసి ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వంట సామగ్రి, బియ్యం తదితర సరుకుల నాణ్యతను పరిశీలించి గడువు తేదీలను తప్పనిసరిగా సరిచూడాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై అవగాహన పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచిస్తూ, కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

# నల్తూరు గ్రామంలో యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను త్వరగా ఏర్పాటు చేయండి

### ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09 :** పటాన్‌చెరులో యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి కోరారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఈ విషయాన్ని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గం లో యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తే ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో 20 ఎకరాలు భూమి కేటాయించినట్లు ఎమ్మెల్సీ రెడ్డి కి చెప్పారు. ఎమ్మెల్సీ అంజి రెడ్డి సంతోషిస్తూ జిన్నారం వెనుకబడిన ప్రాంతం కాబట్టి అక్కడ ఈ స్కూల్ ఉంటే బాగుంటుందని వారు చెప్పారు. త్వరలోనే నల్తూరులో భూమి పూజలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి వస్తున్నట్టు వివరించారు.

# జాక్ పాట్ కొట్టిన భారత్.. భారీగా బయటపడ్డ చమురు నిక్షేపాలు..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, మెయిన్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్- అమెరికా మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ అక్కడి పరిస్థితి యుద్ధ వాతావరణాన్నే తలపిస్తోంది. లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులు ముమ్మరం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ దాడులపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హార్మూజ్ జలసంధిని మరోసారి మూసేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రపంచ దేశాలకు భారీ షాక్ తగిలింది. హార్మూజ్ జలసంధిని పూర్తిగా మూసి వేసిన నేపథ్యంలో అక్కడి వరకూ వెళ్లిన నౌకలను తిరిగి బలవంతంగా వెనక్కు మరలిస్తున్నట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి.పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్తులో భారత్ లోనూ చమురు సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు అయితే దేశ ప్రజలకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం చెబుతోంది. కానీ భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో ఊహించలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో భారత్ కు జాక్ పాట్ తగిలింది. దేశంలోనే అత్యధికంగా పెట్రోలియం లభ్యమయ్యే రాష్ట్రంగా పేరుగాంచిన రాజస్థాన్ లో భారీగా చమురు నిక్షేపాలు బయట పడ్డాయి. 19 బావుల ద్వారా రోజూ దాదాపు 1,202 బ్యారెల్ల చమురును ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఎంతో కొంత భారత్ పై ప్రభావం చూపిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ ఆర్థికంగా మరింత శక్తివంతంగా మారే సమయం వచ్చింది. తాజాగా రాజస్థాన్ లోని థార్ ఎడారి ప్రాంతంలో భారీగా చమురు నిక్షేపాలు బయట పడ్డాయి. దాంతో ముడి చమురు ఉత్పత్తిని భారత్ భారీగా పెంచింది. రాజస్థాన్ జైసల్మేర్ జిల్లాలోని భాగేవాలా ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన ఆయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ మేరకు ముడి చమురు ఉత్పత్తిని గణనీయంగా పెంచేసినట్లు సమాచారం.ఈ ప్రాంతంలో గతేడాది 707 బ్యారెల్స్ చమురు ఉత్పత్తి అయింది. అయితే ప్రస్తుతం 1200 లకు పైగా బ్యారెల్స్ ఉత్పత్తి అవుతోంది. అంటే కొద్ది నెలల్లోనే దాదాపు 70 శాతం ఉత్పత్తి పెరిగింది. భారీగా చమరు నిక్షేపాలు బయటపడడంతోనే ఇది సాధ్యం అయింది. ఇక ప్రస్తుతం ఈ ప్రాంతంలో 19 బావుల ద్వారా ఉత్పత్తి సాగుతోంది. అలాగే మరో 13 కొత్త బావులను తవ్వి టెస్టింగ్ చేస్తున్నారు. ఓ వైపు హార్మూజ్ జలసంధి మూసివేసిన నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత లేకుండా చమురు నిక్షేపాలు బయటపడడం భారత్ కు జాక్ పాట్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# ‘పాకిస్థాన్ నమ్మదగ్గ దేశం కాదు’: అమెరికా, ఇరాన్ చర్చల మధ్యవర్తిత్వం పై ఇజ్రాయెల్

**ఇస్లామాబాద్ వేదికగా జరగబోతున్న శాంతి చర్చలపై ఇజ్రాయెల్ సంచలనం**

**అమెరికా, ఇరాన్ యుద్ధంలో పాక్ మధ్యవర్తిత్వంపై తీవ్ర అభ్యంతరం**

**పాకిస్థాన్ నమ్మదగ్గ దేశం కాదన్న భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, న్యూఢిల్లీ :** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ వేదికగా జరగబోయే శాంతి చర్చలపై ఇజ్రాయెల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్‌ను "నమ్మదగిన పక్షం" గా తాము పరిగణించడం లేదని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 10, 11వ తేదీన ఇస్లామాబాద్‌లో జరగబోయే కీలక భేటీకి ముందు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ వ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి.

**అమెరికా అవసరాల కోసమే..**

వార్తా సంస్థ ఏఎన్ఐతో మాట్లాడిన ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్.. అమెరికా తన సొంత కారణాల వల్ల పాకిస్థాన్ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించుకుందని అభిప్రాయపడ్డారు. గతంలో హమాస్‌తో సంధి కోసం ఖతార్, టర్కీ వంటి సమస్యాత్మక దేశాలను ట్రంప్ బృందం ఎలాగైతే వాడుకుందో.. ఇప్పుడు పాకిస్థాన్‌ను కూడా అలాగే ఉపయోగిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. అయితే ఫలితం విషయంలో మాత్రం తాము అమెరికాతో పూర్తి సమన్వయంతో ఉన్నామని ఆయన పేర్కొన్నారు.ఇరాన్‌తో కాల్పుల విరమణను తాము సమర్థిస్తున్నామని చెబుతూనే.. దక్షిణ లెబనాన్ విషయంలో ఇజ్రాయెల్ తన పట్టును సడలించబోదని అజార్ తేల్చి చెప్పారు. దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా తుడిచి పెట్టడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. లిటాని నదికి దక్షిణాన హిజ్బుల్లా ఉనికిని తాము సహించబోమని హెచ్చరించారు. గత కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ వైమానిక దళం లెబనాన్ వ్యాప్తంగా జరిపిన దాడుల్లో 250 మందికి పైగా హిజ్బుల్లా ఉగ్రవాదులను హతమార్చినట్లు ఆయన వెల్లడించారు.

**ఇరాన్ ముప్పు శాశ్వతంగా తొలగిపోవాలి..**

ఇరాన్‌తో జరగబోయే చర్చల ద్వారా రెండు ప్రధాన ముప్పులు తొలగిపోవాలని ఇజ్రాయెల్ కోరుకుంటోంది. ఒకటి ఇరాన్ అణు కార్యక్రమం, రెండు బాలిస్టిక్ క్షిపణుల ఉత్పత్తి. ఈ రెండు అంశాల్లో అమెరికా ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళిక అమలు కావాలని అజార్ ఆకాంక్షించారు. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల వల్ల రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుప్పకూలే ప్రమాదం ఉందని.. హార్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతాయని హెచ్చరించింది. అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నెతన్యాహు మాత్రం లెబనాన్ ఈ సంధిలో భాగం కాదని ఇప్పటికే స్పష్టం చేశారు. శుక్రవారం ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని అమెరికా బృందం ఇస్లామాబాద్ చేరుకోనున్న తరుణంలో.. ఇజ్రాయెల్ చేసిన ఈ వ్యాఖ్యలు అందరినీ షాక్‌కు గురి చేస్తున్నాయి.



# సరండి గ్రామంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో... పేద ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 09, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో ప్రజాప్రతినిధుల పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 4వ,2వ,3వ వార్డు సభ్యుల్లో,ఉప సర్పంచ్ జవాబుదారీతనం లోపిస్తోందని గ్రామ ప్రజలు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి కీలకంగా ఉండాల్సిన ఈ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలపై దృష్టి సారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్థుల ప్రకారం... తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత వార్డు సభ్యుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై ప్రస్తావించిన స్పష్టత లేదని, తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, రహదారుల దుస్థితి, వీధి దీపాల లేమి వంటి ప్రాథమిక సమస్యలు నెలల తరబడి పరిష్కారం కాకుండా అక్కడక్కడా అలాగే ఉండిపోతున్నాయని పేర్కొంటున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులను సంప్రదించినప్పటికీ, వారు నిర్లక్ష్యంగా స్పందించడం లేదా వాయిదా వేయడం జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభలు ప్రజల సమస్యలను పరిష్కరించే వేదికగా ఉండాల్సినప్పటికీ, సరండి గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామసభలు మాత్రం విభిన్న దిశలో సాగుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ప్రజల అవసరాలను చర్చించాల్సిన చోట, రాజకీయ అంశాలు ప్రాధాన్యం పొందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల గ్రామంలోని అసలు సమస్యలు చర్చకు రాకుండా పక్కన పడుతున్నాయని అంటున్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకోవడం కూడా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులు గ్రామంలో అసంతృప్తి వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పింఛన్లు, రేషన్, గృహ పథకాలు, ఉపాధి హామీ పథకాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు సకాలంలో అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడం, దరఖాస్తులపై పట్టింపు లేకపోవడం వల్ల అనేక మంది ప్రభుత్వ ప్రయోజనాల నుంచి దూరమవుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని ఆశించి ఓట్లు వేసి ఎన్నుకున్న నాయకులే తమ బాధ్యతలను నిర్వర్తించకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, ఎన్నికల తర్వాత ప్రజలతో సంబంధాలు తగ్గిపోయాయని ఆరోపిస్తున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు కూడా సిద్ధంగా లేని పరిస్థితి నెలకొన్నదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు కూడా ఈ కారణంగా నెమ్మదించాయని తెలుస్తోంది. రహదారుల నిర్మాణం, గ్రామపంచాయతీ భవన నిర్మాణం, కాల్వల శుభ్రత, తాగునీటి సరఫరా వంటి పనులు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు ప్రారంభించినా పూర్తి చేయకుండా వదిలేయడం వల్ల ప్రజలకు మరింత ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామ ప్రజలు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పాలో, ఎవరిని ఆశ్రయించాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లినా పెద్దగా స్పందన లేదని కొందరు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రజల్లో నిరుత్సాహం పెరుగుతోంది. గ్రామంలోని యువత కూడా ఈ పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి కోసం కొత్త ఆలోచనలు, కార్యక్రమాలు అవసరమని భావిస్తున్నప్పటికీ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా అవి అమలు కావడం లేదని అంటున్నారు.



గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడకపోతే భవిష్యత్తులో మరింత సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ తమ బాధ్యతలను గుర్తించి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామసభలను సక్రమంగా నిర్వహించి ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే, మండల స్థాయి అధికారులు కూడా ఈ పరిస్థితిపై దృష్టి సారించి సరండి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల పనితీరుపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటేనే గ్రామంలో అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా, సరండి గ్రామంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతూ, అభివృద్ధి పనులను ప్రభావితం చేస్తోందని స్పష్టమవుతోంది. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే భవిష్యత్తులో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్థులు ఆశిస్తున్నారు.

# గర్భధారణపై వేసవి ప్రభావం ఉండదా?

**వేసవిలో గర్భధారణ, ఫెర్టిలిటీ చికిత్సల చుట్టూరా పలు అపోహలు అలుముకుని ఉంటున్నాయి. కానీ నిజానికి వేసవి కాలం... గర్భధారణ మీదా, ఫెర్టిలిటీ చికిత్సల మీదా ఎలాంటి ప్రభావం కనబరచదని అంటున్నారు వైద్యులు. మరిన్ని వివరాలు...**



స్త్రీపురుష పునరుత్పత్తి వ్యవస్థల మీద వేసవి ప్రభావాల గురించిన అనుమానాలు, భయాలతో, దంపతులు ఈ కాలంలో గర్భధారణను వాయిదా వేస్తూ ఉంటారు. అయితే ఇది వాస్తవ విరుద్ధం. ఎందుకంటే....

**గర్భధారణ సామర్థ్యం తగ్గదు**

వేసవిలో గర్భధారణ కష్టమనీ, ఆ అవకాశాలు సన్నగిల్లుతాయని మహిళలు అపోహపడుతూ ఉంటారు. కానీ ఇది నిజం కాదు. అండాల విడుదల పూర్తిగా హార్మోన్ల మీదే ఆధారపడుతుంది. హార్మోన్ స్రావాలు మెదడు, అండాశయాల మీదే ఆధారపడతాయి కాబట్టి వీటికి కాలంతో పని ఉండదు. కాబట్టి అన్ని కాలాల మాదిరిగానే వేసవి కాలంలో కూడా అండాలు యధాతథంగా విడుదలవుతాయి

**వేడి ప్రభావం ఉండదు**

వేడి వల్ల మహిళల పునరుత్పత్తి వ్యవస్థ దెబ్బతినదు. అండాశయాలు, గర్భాశయం, అండాలు వేడి ప్రభావానికి ఏమాత్రం గురి కావు. మన శరీరాల్లో 'హోమియోస్టేసిస్' అనే స్వీయ నియంత్రణ ప్రక్రియ ఉంటుంది. ఫలితంగా అంతర్గత అవయవాలేవీ దెబ్బతినే వీల్లేకుండా, శరీర అంతర్గత ఉష్ణోగ్రత క్రమబద్ధంగా సాగుతూ ఉంటుంది. దాంతో అన్ని జీవక్రియల్లాగే, పునరుత్పత్తి జీవక్రియ కూడా క్రమబద్ధంగా సాగుతూ ఉంటుంది. దీనికి వేసవి వేడితో ఎలాంటి సంబంధం ఉండదు

**నెలసరి క్రమం తప్పదు**

నెలసరులు కూడా హార్మోన్ల మీదే ఆధారపడతాయి. కాబట్టి నెలసరికీ వేసవికీ సంబంధం ఉండదు. ఎక్కువ బరువు పెరిగినా, తగ్గినా, ఒత్తిడి, ప్రయాణాలు, డీహైడ్రేషన్ పెరిగినా నెలసరి క్రమం తప్పవచ్చు. అంతే తప్ప వేసవి వల్ల నెలసరులు క్రమం తప్పవు

**వేసవిలో గర్భధారణ**

వేసవిలో గర్భధారణ ప్రయత్నాలు మానుకోవలసిన అవసరం ఏమాత్రం లేదు. వేసవి కారణంగా, ఓవ్యులేషన్ ఇండక్షన్ లాంటి చిన్న చికిత్సల కోసమైనా, ఐయుఐ, ఐవిఎఫ్ లాంటి పెద్ద చికిత్సల కోసమైనా వెనకడుగు వేయవలసిన అవసరం లేదు. గర్భ?ధారణ విజయావకాశాలు అండాలు, అండాల విడుదల, వీర్యకణాలు, అండాల నాణ్యత, ఆరోగ్యం మీదే ఆధారపడి ఉంటాయి. ఇవన్నీ వేసవి కారణంగా దెబ్బతినవు కాబట్టి ప్రత్యేకించి వేసవిలో గర్భధారణ చికిత్సలను వాయిదా వేయవలసిన అవసరం లేదు

**పురుషుల మీద వేసవి ప్రభావం**

మహిళలతో పాటు పురుషుల పునరుత్పత్తి వ్యవస్థ మీద వేసవి ప్రభావం ఉండదు. శరీర ఉష్ణోగ్రత కంటే రెండు నుంచి మూడు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలో వీర్యకణాల సామర్థ్యం మెరుగ్గా ఉంటుంది. కాబట్టే వీర్యకణాల నాణ్యత, సామర్థ్యాల మెరుగుదల కోసం హాట్ టబ్‌లో స్నానాలు చేయొద్దనీ, బిగుతైన లోదుస్తులు వేసుకోవద్దనీ, దీర్ఘ సమయాల పాటు ల్యాప్‌ట్ప?పలను ఒళ్లో పెట్టుకుని పని చేయొద్దనీ, వైద్యులకు పురుషులకు సూచిస్తూ ఉంటారు. ఈ పనులన్నీ వీర్యకణాల సంఖ్యనూ, కదలికలనూ తగ్గిస్తాయి. కానీ వేసవి వాతావరణం ఒక్కటే పురుషుల వీర్యకణాల మీద ఎలాంటి ప్రభావాన్నీ కనబరచదు

**వీర్యకణాల సామర్థ్యం ఏ మేరకు?**

పురుషుల పునరుత్పత్తి సామర్థ్యం వేసవిలో తగ్గి, చలికాలంలో పెరుగుతుందనే అపోహ ప్రచారంలో ఉంది. కానీ ఇది నిజం కాదు. పురుష పునరుత్పత్తి వేసవిలో తక్కువగా, చలికాలంలో ఎక్కువగా ఉండదు. మన శరీరాల్లోని సహజసిద్ధ హోమియోస్టేసిస్ స్థితి, ఈ అంశానికి కూడా వర్తిస్తుంది. అన్ని కాలాల్లోనూ మన శరీరం అంతర్గత వ్యవస్థలన్నిటినీ ఎంతో మెరుగ్గా క్రమబద్ధీకరిస్తుంది. ఫలితంగా వేసవిలో కూడా బయటి ఉష్ణోగ్రతతో సంబంధం లేకుండా వీర్యకణాల ఉత్పత్తి కొనసాగుతుంది. కాబట్టి వేసవిలో సైతం వీర్యకణాలు సజీవంగానే ఉంటాయి. అయితే డీహైడ్రేషన్ వల్ల మహిళల్లో అండాలు, పురుషుల్లో వీర్యకణాల నాణ్యత తాత్కాలికంగా తగ్గిపోవచ్చు. సమస్య తొలగిపోగానే ఈ పరిస్థితి కూడా తిరిగి సర్దుకుంటుందనే విషయం గుర్తుపెట్టుకోవాలి.

**ఫెర్టిలిటీ చికిత్సల పట్ల అవగాహన ఇలా...**

ఫెర్టిలిటీ చికిత్సల పట్ల కూడా కొన్ని అపోహలు నెలకొంటున్నాయి. ఐవిఎఫ్ విజయావకాశాలు వేసవిలో తగ్గుతాయన్నది కూడా అపోహ మాత్రమే!

వయసు: మహిళల వయసు పెరిగేకొద్దీ గర్భధారణ అవకాశాలు సన్నగిల్లుతాయి. సహజసిద్ధ గర్భధారణ, ఐవిఎఫ్ విజయావకాశాలు పెరిగే వయసుతో తగ్గుతాయి. 30 ఏళ్ల లోపు గర్భధారణ అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. 30 నుంచి 35 ఏళ్ల వరకూ కొంత మేరకు అవకాశాలుంటాయి. 35 నుంచి అవకాశాలు క్షీణించడం మొదలుపెడతాయి. అంతకంటే వయసు పెరిగేకొద్దీ అవకాశాలు బాగా దిగజారతాయి. కాబట్టి వేసవి గురించి ఫెర్టిలిటీ చికిత్సలు వాయిదా వేసుకోకూడదు. ఆలస్యం చేసేకొద్దీ పైబడే వయసుతో గర్భధారణ అవకాశాలు తగ్గిపోతూ ఉంటాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి. పైబడే వయసు, ఎంబ్రియో నాణ్యత, గర్భాశయం, ఇతరత్రా ఆరోగ్య సమస్యల మీద మాత్రమే గర్భధారణ అవకాశాలు ఆధారపడి ఉంటాయి తప్ప వేసవి మీద కాదు.

ఫెర్టిలిటీ చికిత్సలు: ఐవిఎఫ్ ల్యాబ్స్ అన్నీ కఠినమైన ఉష్ణోగ్రత నియంత్రణ ప్రమాణాలను కలిగి ఉంటాయి, క్రమబద్ధంగా పని చేస్తూ ఉంటాయి. కాబట్టి ఫెర్టిలిటీ చికిత్సల మీద వేసవి ప్రభావం ఉండదు. వేసవి వేడి వల్ల ఎంబ్రియోలు కూడా దెబ్బ తినవు. ఎంబ్రియోలను కల్చర్ చేసే సమయంలో అత్యంత నియంత్రిత ఇంక్యుబేటర్స్‌లో ఉంటాయి. ఈ ఇంక్యుబేటర్స్ నియంత్రిత ఉష్ణోగ్రతల్లో పని చేస్తాయి, ప్రతి క్షణం వాటి మీద పర్యవేక్షణ కొనసాగుతుంది కాబట్టి బయటి ఉష్ణోగ్రతల ప్రభావం ల్యాబ్‌లోని ఎంబ్రియోల మీద ఏమాత్రం ఉండదు. ఇందుకోసం ఉన్నత ప్రమాణాలు పాటించే ఫెర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులను ఫెర్టిలిటీ చికిత్సల కోసం ఎంచుకోవాలిఒవేరియన్ స్టిమ్యులేషన్: అండాల పెరుగుదలను ప్రేరేపించే ఇంజెక్షన్ల ప్రభావం వేసవిలో తగ్గదు. ఫెర్టిలిటీ చికిత్సలో అండాశయాలను ప్రేరేపించి, అండాల విడుదలను పెంచేవి మందులే తప్ప సీజన్లు కావు

ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్: ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ పూర్తిగా గర్భాశయం, హార్మోన్ నియంత్రిత ఎండోమెట్రియల్ రిసెప్టివిటీల మీదే ఆధారపడి ఉంటుంది. కాబట్టి బయటి ఉష్ణోగ్రతకూ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్‌కూ ఎలాంటి సంబంధం ఉండదు

**వేసవిలో వాయిదా:** ఫెర్టిలిటీ చికిత్సల విజయావకాశాలన్నీ వయసు, ఆరోగ్యం, అండాలు, వీర్యకణాల నాణత్య, సంఖ్యల మీదే ఆధారపడి ఉంటాయి. కాబట్టి ఇవన్నీ మెరుగ్గా ఉన్నప్పుడు వేసవిలో కూడా ఫెర్టిలిటీ చికిత్సలను కొనసాగించవచ్చు. అందుకోసం చలికాలం వరకూ ఆగవలసిన అవసరం లేదు

వీర్యకణాల నాణ్యత: ప్రత్యేకించి వేసవిలో ఫెర్టిలిటీ చికిత్సలు తీసుకునే సమయంలో వీర్యకణాల నాణత్య దిగజారుతుందన్నది కూడా అపోహే!

డాక్టర్ అఖిల అయ్యగారి
సీనియర్ కన్సల్టెంట్,
క్లౌడ్ నైన్ గ్రూప్
ఆఫ్ హాస్పిటల్స్,బంజారాహిల్స్, హైదరాబాద్

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.